క్లుప్తంగా

మద్దతు ధర చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్: మొక్కజొన్న, పత్తి పంటలకు మద్దతు ధర చెల్లించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరేష్, కృష్ణయ్య, భిక్షం, బాలు, సోమ్లా పాల్గొన్నారు.

ప్రత్యేక టీచర్లను నియమించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో దివ్యాంగుల, అంధులకు ప్రత్యేక టీచర్లను నియమించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ కోరారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈఓ దక్షిణామూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు రడం సారయ్య, యాకయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

నెహ్రూసెంటర్: వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్ఎం పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఫిజియోథెరపీస్టు యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు బుధవారం కోరారు.

మరమ్మతులు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని అండర్‌బ్రిడ్జి రహదారి అధ్వానంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్‌సుందర్ శర్మ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు అండర్ బ్రిడ్జిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్‌శర్మ మాట్లాడుడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇందు భారతి, పట్టణ ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు రవియాదవ్, వలందాస్ భద్రయ్య, రేష్మా, చక్రి పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థినుల ప్రతిభ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని కె.రిషిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం కె.గిరిజ, వ్యాయామ ఉపాధ్యాయులు మహంకాళి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

కురవి: మండలంలోని నేరడ మోడల్ స్కూల్‌కు చెందిన బి.జ్యోష్ను అనే 9వ తరగతి విద్యార్థిని సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరువులో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగే కబడ్డీ పోటీలకు గాను రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ బుధవారం తెలిపారు.

ముగిసిన క్రీడాపోటీలు

బయ్యారం: బయ్యారంలో రెండు రోజులుగా కొనసాగుతున్న మండలస్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిసినట్లు ఎంఈఓ దేవేంద్రాచారి తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో బయ్యారం బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ, వెంకటరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. బాలికల విభాగంలో కేజీబీవీ ప్రథమ, బాలికల ఉన్నత పాఠశాల ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు.

రాష్ట్ర కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్

మహబూబాబాద్: రంగారెడ్డి జిల్లా తుర్కాయాజల్‌లో జరిగిన సీఐటీయూ రాష్ట్ర మహాసభలో సీఐటీయూ అనుబంధ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మానుకోటకు చెందిన కాంపెల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గూడూరు: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం పరిధిలో నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి కబడ్డీ వాలీబాల్ క్రీడలలో మండలంలోని దామరవంచ గిరిజన బాలుర గురుకుల, పానుగోడు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. కబడ్డీలో తోలెం భవన్‌దీక్షిత్ రాష్ట్రస్థాయికి, జె.చరణ్‌తేజ్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఆంగోతు ఈశ్వర్, ఆర్.భానుప్రసాద్ వాలీబాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.

శతాధిక వృద్ధురాలి మృతి


అవయవదానం చేస్తున్న బచ్చమ్మ (ఫైల్)

కురవి: కురవికి చెందిన పెండెం బచ్చమ్మ (105) అనే శతాధిక వృద్ధురాలు అనారోగ్యానికి గురై బుధవారం సాయంత్రం మృతి చెందింది. ఏడాదిన్నర క్రితం ఆమె పార్థివదేహాన్ని మహబూబాబాద్ మెడికల్ కళాశాలకు దానం చేసేందుకు ఆమె అంగీకారం తెలిపింది. పలు సంఘాల నాయకులు ఆమె మృతికి సంతాపం తెలిపారు.

మలుపులు.. మృత్యు పిలుపులు

- రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు
- ప్రమాదకరంగా మారిన ప్రయాణం


రాజోలు నుంచి గాజ తండాకు వెళ్లే మార్గంలో మలుపు..


బలపాల నుంచి గాజ తండాకు వెళ్లే మార్గం..

కురవి: మండలంలోని పలు గ్రామాల నుంచి తండాలకు వెళ్లే మార్గాల్లోని మలుపులు మృత్యుకుహరాలుగా మారాయి. తండాల గ్రామాలకు వెళ్లేందుకు నిర్మించిన రోడ్లు చిన్నవిగా ఉండడానికి తోడుగా రోడ్లకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు, మురికి తుమ్మ చెట్లు రోడ్లను మరీ ఇరుకుగా మార్చాయి. దీంతో ఆయా రోడ్లపై ప్రయాణాలు ప్రమాదకరంగా మారిపోయాయి. కురవి నుంచి తిర్మలాపురం, అక్కడి నుంచి టీకుల తండా, గాజతండా వరకు, గాజతండా నుంచి రాజోలుకు, గాజతండా నుంచి బలపాల గ్రామానికి, నల్లెల్ల నుంచి లింగ్యాతండా వరకు ఉన్న రోడ్లు ఇరుకుగా తయారయ్యాయి. మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈరోడ్లపై ప్రయాణించే వాహన చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి లేకుండాపోయింది. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లే వాహనచోదకులు భయంతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మా మార్గాల్లో అనేక ప్రమాదాలు ఇప్పటికే జరిగాయి. ఈ ప్రాంతాలే కాకుండా కురవి, సీరోలు మండలాల్లోని చాలా తండా గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు మారాలంటే రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను, తుమ్మ చెట్లను తొలగించాలి. అలాగే మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తే కొంతైనా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. అధికారులు ఆ దిశగా ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

డోర్నకల్: మిగులు బడ్జెట్‌తో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక లక్ష్మీటాకీస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని బుధవారం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాలంటే బీజేపీ అధికారంలోకి రావడం అవసరమన్నారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని దారావత్ నరేష్ బీజేపీలో చేరి పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తూ డోర్నకల్‌లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు దారావత్ నరేష్, మదన్‌నాయక్, సింగారపు అశోక్, గద్దం అశోక్, రెహమాన్, రూరల్ మండల అధ్యక్షులు గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షులు దేవానాయక్ నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


కేసముద్రం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే అన్నివిధాలుగా అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టే నూతన జీపీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ క్రాంతి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గుగులోతు దస్రూనాయక్, రావుల మురళీ, బండారు వెంకన్న, బండారు దయాకర్, మంగ యాకన్న, వెంకట్రావు, మల్లయ్య, గాదె శ్రీనివాస్, ఐతే సారయ్య, మధుకర్, శ్రీనివాస్, కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మహబూబాబాద్ రూరల్: గ్రామాలు, తండాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి, సోమ్లా తండా గ్రామపంచాయతీల పరిధిలో పలు విద్యుత్ పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ విజయేందర్ రెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ సునీతాదేవి, ఏడీఈ ఐలయ్య, రూరల్ ఏడీఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

సీఆర్టీలకు టైం స్కేల్ వర్తింపజేయాలి

మహబూబాబాద్ అర్బన్: రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఒప్పంద విధానంలో పనిచేస్తున్న సీఆర్టీలకు టైం స్కేల్ వర్తింపజేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ముత్యాలమ్మగూడెం ఆశ్రమ పాఠశాల, సోషల్ వెల్ఫేర్, మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఘనపురం భిక్షపతి, ప్రధాన కార్యదర్శి సారెడ్డి రామలింగారెడ్డి, సీనియర్ నాయకులు సోమ విష్ణువర్ధన్, మండల బాధ్యులు పాల్గొన్నారు.

కేసులు వెంటనే ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్: ఆర్టీసీ, నల్ల చట్టాల రద్దు పోరాటాల్లో వామపక్ష పార్టీలపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని వామపక్ష నాయకులు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. ఉద్యమ కేసుల్లో భాగంగా బుధవారం కోర్టుకు హాజరైన అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నేతలు అజయ్‌సారథిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజు, రాజన్న, నవీన్, వెంకన్న పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


వలంటీర్లతో కోఆర్డినేటర్ నారాయణ

తొర్రూరు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ సూచించారు. మహబూబాబాద్ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో క్యాంపు కొనసాగింది. జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ మునుకుంట్ల యాదలక్ష్మీలతో కలిసి నారాయణ మాట్లాడారు. నాయకత్వ లక్షణం ప్రతీ విషయంలో కమాండింగ్‌ను పెంచుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపుల ద్వారా సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. కార్యక్రమంలో నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరిగకూటి శ్రీనివాస్‌రెడ్డి, మై భారత్ జిల్లా కన్వీనర్ చింతల అన్వేష్, తండా హరీష్, వలంటీర్లు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి


గార్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో..

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
- గార్ల/కేసముద్రం/డోర్నకల్/గూడూరు


డోర్నకల్: మున్సిపల్ కార్యాలయంలో..

ప్రతీ ఒక్కరు నేత్రాలను కాపాడుకోవాలి


కంటి పరీక్ష చేయించుకుంటున్న జడ్జి ధీరజ్‌కుమార్

తొర్రూరు: మానవ శరీరంలో నేత్రాలు ప్రధానమైనవని, వాటిని కాపాడుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి దామెర ధీరజ్‌కుమార్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శరత్ కంటి ఆసుపత్రి సహకారంతో జడ్జితోపాటు పలువురు న్యాయవాదులు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. జడ్జి మాట్లాడుతూ.. ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీల వాడకం పెరగడంతో అన్ని వయస్సుల వారు కంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. కంటి సంరక్షణపై ప్రజలు శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముకుందరావు, ప్రధాన కార్యదర్శి మైలపాక అశోక్, ఉపాధ్యక్షులు ఆర్కే ఘనపురం, కోశాధికారి నాగరాజు, న్యాయవాదులు బండపల్లి వెంకన్న, వెంకటరత్నం, బానోతు లాలు, కుమార్‌లు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి


ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చొప్పరి శేఖర్, పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో రిజర్వేషన్ కల్పించాలని సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీల ఆమోదించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్‌ల ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథి రెడ్డి, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, వెలుగు శ్రావణ్, ఫాతిమా పాల్గొన్నారు.

పత్తిచేనులో గడ్డిమందు పిచికారీ


ఎండిన పత్తి మొక్కలను చూపిస్తున్న బాధితులు

గార్ల: పచ్చని పత్తిపంటపై గడ్డి కలుపు మందు పిచికారీ చేయడంతో మూడు ఎకరాల పత్తిచేను పూర్తిగా ధ్వంసమైన సంఘటన తిర్లాపురం గ్రామ సమీపంలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. గార్ల మండలం తిర్లాపురం గ్రామం శివారు కొత్త తండాలో అనిత, లలిత అనే అక్కచెల్లెళ్లు సాగు చేసిన పత్తిపంటపై తమ తండ్రినే గడ్డిమందు పిచికారీ చేయించారని వారు కన్నీటి పర్యంతమయ్యారు. 3ఎకరాల పత్తిపంటకు ఇప్పటికే రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టామన్నారు. మొదటి భార్య పిల్లలకు తన ఆస్తిపై హక్కు లేదని తండ్రి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వారు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపించారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను ఆక్రమించిన స్థానికులు


ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, స్థానికులు

తొర్రూరు: డబుల్ బెడ్రూం ఇళ్లను అందజేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ.. లబ్ధిదారులు ఆ ఇళ్లను నేరుగా ఆక్రమించుకున్నారు. అధికారులు ఇచ్చిన మాటలపై నమ్మకం సన్నగిల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లు పేదలకు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులో గత కొద్ది రోజులుగా స్థానికులు ఆందోళన చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు శ్రీనివాస్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్ ఇళ్లు ఆక్రమించిన వారితో మాట్లాడేందుకు యత్నించారు. ప్రభుత్వం అధికారికంగా ప్రొసీడింగ్ ఇచ్చిన తర్వాతే రావాలని తహసీల్దారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా స్థానికులు ససేమిరా ఒప్పుకోలేదు. ఎట్టి పరిస్థితిలో ఇళ్లను వదిలేది లేదని కూర్చున్నారు.

మనోధైర్యం దెబ్బతీసేలా ప్రభుత్వ చర్యలు

తొర్రూరు: తనిఖీ బృందాల ఏర్పాటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుల మనోధైర్యం దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.మురళీకృష్ణ తెలిపారు. డివిజన్ కేంద్రంలో బుధవారం యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు నాగమల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, ఎండీ రఫీ, చైతన్య, శంకర్, రాధాదేవి, మల్లయ్య, యాకేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు అందజేత

నెల్లికుదురు: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఏఐసీసీ అబ్జర్వర్ పట్నాయక్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు మండలంలోని నైనాల గ్రామానికి చెందిన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెరుమాడ్ల గుట్టయ్య గౌడ్ బుధవారం తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు: దశాబ్దాల కాలంగా హమాలీ వర్కర్స్ కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అనేక పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నాయని జిల్లా సీఐటీయూ నాయుడు బాబు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు హామీ కలగానే మిగిలిందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో పొలం బాట, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మచ్చ ఐలయ్య మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

విద్యుత్ మోటార్ల చోరీ

గార్ల: మండలంలోని రాంపురం గ్రామ సమీపంలో గల పాకాల ఏటిపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ షెడ్‌లో 2పెద్ద విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయని గ్రామస్తుడు ఆడెపు వెంకటేశ్వర్లు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

బయ్యారం: మండలంలోని ఇర్సులాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం తహసీల్దార్ నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. తహసీల్దార్ వెంట హెచ్ఎం శోభన్‌బాబు, వార్డెన్ లాలయ్య పాల్గొన్నారు.

పేద బిడ్డల అభ్యున్నతికి పాటుపడాలి

తొర్రూరు: పేద బిడ్డల విద్యాభివృద్ధికి అందరూ పాటుపడాలని లయన్స్ సేవా తరుణి అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవిరెడ్డి అన్నారు. లయన్స్ సేవా తరుణి ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం యాకస్వామి, ప్రతినిధులు కూన పద్మావతి, రేణుకారెడ్డి, ఉమారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మరిపెడ రూరల్: గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పటించాలని మరిపెడ పంచాయతీ రాజ్ శాఖ డీఈ నర్సింగ్ సూచించారు. మరిపెడ మండలం బాల్నిధర్మారం గ్రామంలో ఉపాధి నిధులు రూ. 20లక్షలతో గ్రామంలోని గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను బుధవారం డీఈ నర్సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ అజయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్, బండారు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఈనెల 24, 25 తేదీల్లో గార్ల మండల కేంద్రంలో జరగనున్న తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు.

పోషకాహారంతో ఆరోగ్యం



గూడూరు: గర్భిణులు, బాలింతలు పోషకాహారంతో ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మట్టెవాడ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నీలిమ, సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కారోబార్‌ను తొలగించాలి

నర్సింహులపేట: మండలంలోని నర్సింహపురం బంజర గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కారోబార్ రామనబోయిన వెంకన్నను తొలిగించాలని డిమాండ్ చేస్తు బుధవారం ఎంపీడీఓ రాధికకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గతంలో కారోబార్ పలు అవినీతి పనులకు పాల్పడగా అప్పటి పాలకవర్గం తొలిగించారని తెలిపారు. మళ్లీ విధుల్లోకి చేరాడని, వెంటనే అతడిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాపారావు, నర్సయ్య, వీరన్న, పరిషయ్య, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి

కురవి: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని, అప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని హెచ్ఎం డోరి అరుణశ్రీ,, కెరీర్ గైడ్ కోటా కిశోర్ బాబు అన్నారు. బుధవారం సీరోలు మండలంలోని కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్యాంకు సేవలపై అవగాహన అవసరం

డోర్నకల్: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే బ్యాంకు సేవలపై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ నాగతేజారెడ్డి కోరారు. స్థానిక పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు బుధవారం యూనియన్ బ్యాంకును సందర్శించగా బ్యాంకు మేనేజర్ బ్యాంకు సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బండి నర్సింహరావు, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, అమీనాబేగం పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కొత్తగూడ: బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల జాక్ జిల్లా నాయకుడు పెద్దకాసు కుమారస్వామి కోరారు. అన్ని బీసీ కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో నూకల సురేందర్, కొమ్మనబోయిన వేణు, కుసుమ రాజన్ బాబు పాల్గొన్నారు.

కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన

దంతాలపల్లి: కిసాన్ కపాస్ యాప్‌పై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి వాహిని అన్నారు. మండలంలోని రేపోని, లక్ష్మీపురం గ్రామాలలో బుధవారం పత్తిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్, రైతులు పాల్గొన్నారు.

విషపదార్థం తిని కుప్పకూలిన శునకానికి ఊపిరి

పెద్దవంగర: చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న మూగజీవికి ప్రాణం పోసి మానవత్వాన్ని చాటుకున్నాడు ఓ యువకుడు. మండలంలోని పోచంపల్లి శివారు ఏనమీది తండాలో విషపదార్థం తిని చావుబతుకుల మధ్య ఉన్న శునకాన్ని యువకుడు రాంచరణ్ చూసి చలించిపోయాడు. వెంటనే అవుతాపురం పశువైద్య సహాయకుడు అనిల్‌కు సమాచారం అందించాడు. ఇద్దరి సమయస్ఫూర్తితో శునకం ప్రాణాలు కాపాడారు.

టీకాతోనే గాలికుంటు వ్యాధి నివారణ


డోర్నకల్: టీకా వేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

డోర్నకల్/గార్ల/పెద్దవంగర: పశువులకు టీకాలతో గాలికుంటు వ్యాధిని నివారించవచ్చని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి బి.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఏడో విడత జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు నోరు, డెక్కల మధ్య పుండ్లు ఏర్పడతాయని తెలిపారు. వ్యాధిత సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. టీకాలతో వ్యాధిని నివారించవచ్చని తెలిపారు.

పోలీసులతో దురుసు ప్రవర్తన.. రిమాండ్‌కు తరలింపు

మహబూబాబాద్ రూరల్: పోలీసుల విధులను ఆటంకపరుస్తూ, పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని మహబూబాబాద్ రూరల్ రెండో ఎస్సై కె.రవికిరణ్ బుధవారం తెలిపారు. ఈనెల 10వ తేదీన ఎస్సై దీపిక తన సిబ్బందితో శనిగపురం గ్రామంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నారన్నారు. మండలంలోని హజారియా తండాకు చెందిన బానోతు సుమన్ అనే వ్యక్తి మద్యం తాగి పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడని తెలిపారు.

నాన్ బెయిలబుల్ వారెంట్ నిందితుడి రిమాండ్

మహబూబాబాద్ రూరల్ : న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాల మేరకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీకాబడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈమేరకు కేసు వివరాలను సీఐ వెల్లడించారు. టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2020 సంవత్సరంలో భూమి తగాదా విషయంలో ఫిర్యాదుదారులను కొట్టి గాయపరచిన విషయంలో నమోదైన కేసులో పట్టణంలోని సుందరయ్య నగర్ ప్రాంతానికి చెందిన నిందితుడుగా ఉన్న మాదాసి కార్తీక్ పై విచారణ జరుగుతున్న సందర్భంలో న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందని పేర్కొన్నారు. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు ఆదేశాల ప్రకారం రిమాండ్కు తరలించామని తెలిపారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646